జనం కోసం.. అక్షర సమరం

# ఇదీ సంగతి

సంపుటి: 5 - సంచిక: 13 | 9 సెప్టెంబర్ 2026 | బుధవారం | 4 పేజీలు

## పుట్టినరోజు నాడే.. యువకుడి దుర్మరణం



(నిజామాబాద్ క్రైం, ఇదీ సంగతి)

పుట్టినరోజు నాడే ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన ఎడపల్లి మండలంలో బుధవారం చోటుచేసుకుంది. అంబం గ్రామానికి చెందిన కుర్మా సదానంద్ (23) కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై జానకంపేట డీటీసీ శివారులోని చెట్టుకు ఉరివేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. సదానంద్ ఇంట్లో తల్లిదండ్రుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో కొంతకాలంగా మనస్తాపంతో ఉన్నాడు. ఈ క్రమంలో బుధవారం జానకంపేట డీటీసీ శివారుకు వెళ్లి చెట్టుకు ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అతడి సెల్‌ఫోన్ ఆధారంగా ఆచూకీ గుర్తించి ఘటనా స్థలానికి చేరుకున్నారు.అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న సదానంద్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించినట్లు సమాచారం. కాగా, బుధవారమే సదానంద్ పుట్టినరోజు కావడంతో ఈ ఘటన కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కుమారుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## ఉచిత శిక్షణను.. సద్వినియోగం చేసుకోవాలి

- నిరుద్యోగ యువతకు కలెక్టర్ భవేష్ మిశ్రా, సీపీ సాయి చైతన్య పిలుపు..

(నిజామాబాద్ ప్రతినిధి, ఇదీ సంగతి)

ప్రభుత్వ ఉద్యోగాలకు తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో ఏకాగ్రత, పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తేనే లక్ష్యాన్ని చేరుకోగలమని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. పోలీస్ ఉద్యోగార్థుల కోసం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో కొనసాగుతున్న శిక్షణ శిబిరాన్ని పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్యతో కలిసి కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో సుమారు 200 మందిని ఎంపిక చేసి రెండు నెలల పాటు ఉచిత శిక్షణ అందిస్తున్నారు. అభ్యర్థులకు భోజన వసతితో పాటు థియరీ, దేహదారుఢ్య పరీక్షలకు నిపుణులతో శిక్షణ ఇస్తున్నారు.అభ్యర్థులతో కలెక్టర్ మాట్లాడి పలు సూచనలు చేశారు. రీజనింగ్ ఎబిలిటీ, ఆంగ్లం, గణితం అంశాల్లో ఎక్కువ మార్కులు సాధించేందుకు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. స్వయంగా నైపుణ్య సామర్థ్య పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. లక్ష్యాన్ని చేరుకునే వరకు నిరంతర ప్రయత్నం కొనసాగించాలని సూచించారు. సరైన ప్రణాళిక, కష్టపడే తత్వం, సానుకూల దృక్పథంతో ఏదైనా సాధించవచ్చని అభ్యర్థుల్లో ఆత్మవిశ్వాసం నింపారు.రెండు నెలల పాటు సెల్‌ఫోన్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి శిక్షణపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని హితవు పలికారు. అనవసర భయాలను వీడి ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు.పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య మాట్లాడుతూ హైదరాబాద్‌లో అందించే కోచింగ్‌కు ఏమాత్రం తీసిపోని విధంగా మెరుగైన స్టడీ మెటీరియల్, నిష్ణాతులైన ఫ్యాకల్టీతో శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు సరైన మార్గదర్శకత్వం అందించడం పోలీస్ శాఖ సామాజిక బాధ్యతలో భాగమన్నారు. అర్హత, ప్రతిభ ఉన్న అభ్యర్థులు పోలీస్ ఉద్యోగాలు సాధించి ప్రజలకు సేవలందించాలనే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు.శిక్షణ తరగతులకు క్రమం తప్పకుండా హాజరవుతూ నిరంతర సాధన చేయాలని సూచించారు. రెండు నెలల పాటు వినోదాలు, వేడుకలకు దూరంగా ఉండి లక్ష్యంపై దృష్టి పెడితే పోలీస్ శాఖలో చేరాలనే కలను సాకారం చేసుకోవచ్చని పేర్కొన్నారు.కార్యక్రమంలో గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, భాగ్యకిరణ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ భాగ్యకిరణ్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి






(నిజామాబాద్ క్రైం, ఇదీ సంగతి)

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు పదోన్నతులు కల్పించారు. ఎ.గణేష్ (పీసీ--74) -- టౌన్--2 పోలీస్‌స్టేషన్, నిజామాబాద్, అలాగే కే.వినోద్‌కుమార్ (పీసీ--605) -- టౌన్--3 పోలీస్‌స్టేషన్ పదోన్నతి పొందారు.వీరు బుధవారం పోలీస్ కమిషనర్ సాయి చైతన్యను మర్యాదపూర్వకంగా కలిశారు.కొంతకాలంగా పదోన్నతి కోసం ఎదురుచూస్తున్న తమకు హెడ్‌కానిస్టేబుల్ హోదా రావడంతో సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీ సాయి చైతన్య వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పదోన్నతితో మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

### ప్రేమించిన యువతి పెళ్లి

## మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

(నిజామాబాద్, ఇదీ సంగతి)



ప్రేమించిన యువతి మరో వ్యక్తిని పెళ్లి చేసుకోవడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దర్పల్లి మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండలానికి చెందిన విజయ్ కొంతకాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. అయితే ఆమె రెండు రోజుల క్రితం మరో వ్యక్తిని వివాహం చేసుకున్నట్లు తెలిసింది.ఈ విషయం తెలుసుకున్న విజయ్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. తన బాధను వ్యక్తం చేస్తూ ఓ వీడియోను రూపొందించి, కుటుంబ సభ్యులకు క్షమాపణలు చెబుతూ భావోద్వేగానికి గురైనట్లు సమాచారం. అనంతరం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గుర్తించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది.ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జనం కోసం.. అక్షర సమరం

# ఇదీ సంగతి

సంపుటి: 5 - సంచిక: 13 | 9 సెప్టెంబర్ 2026 | బుధవారం | 4 పేజీలు





# ఎస్ఐఆర్.. నోటీసుల మోత

- వయసు తేడాలు.. పేర్లలో పొరపాట్లు.. కుటుంబ సంబంధాల్లో వ్యత్యాసాలు
- 1,09,639 నోటీసుల్లో 60,608 పంపినీ.. ఇంకా 49,031 పెండింగ్
- హియరింగ్ పూర్తయింది 17,939 మందికే.. 49,592 మందికి గడువు ముగింపు

(నిజామాబాద్ ప్రతినిధి, ఇదీ సంగతి)

ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో నోటీసుల జారీ ఓటర్లకు కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతోంది. కుటుంబ సభ్యుల మధ్య వయసు తేడాలు, పేర్లలో అక్షర దోషాలు, పుట్టిన తేదీల్లో వ్యత్యాసాలు, కుటుంబ సంబంధాల నమోదులో తప్పుల ఆధారంగా అనామలీస్ గుర్తిస్తున్నారు. దీంతో చిన్నపాటి పొరపాట్లకు సైతం ఓటర్లు ధ్రువపత్రాలతో అధికారుల ఎదుట హాజరు కావాల్సి వస్తోంది.భార్యాభర్తల మధ్య వయసు తేడా తొమ్మిది నెలల కంటే తక్కువగా ఉన్నా అదనపు పరిశీలనకు సంబంధించిన కేసుగా పరిగణిస్తున్నారు. తల్లిదండ్రులు, పిల్లల మధ్య వయస్సు తేడా 15 ఏళ్ల కంటే తక్కువగా లేదా 50 ఏళ్లకు మించి ఉన్నా ఆధారాలు సమర్పించాలని సూచిస్తున్నారు. ఒకే పేరును తండ్రి పేరుగా నమోదు చేసిన సందర్భాల్లోనూ సవరణలు కోరుతూ నోటీసులు ఇస్తున్నారు. దీంతో అసలు తప్పు ఎక్కడ జరిగిందో తెలియక పలువురు ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు. - వివరాలు 3లో




## ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారిపై లారీ బోల్తా

(నిజామాబాద్, ఇదీ సంగతి)



ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారిపై చంద్రాయన్‌పల్లి శివారులో లారీ బోల్తా పడింది.ఈ ఘటన ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లి శివారులో బుధవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం..హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న లారీ అకస్మాత్తుగా డివైడర్ ను ఢీ కొని బోల్తా పడింది. రోడ్డు మరమ్మతుల కోసం యాజమాన్యం చేపట్టిన పనుల్లో నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని వారు ఆరోపించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

(నిజామాబాద్, ఇదీ సంగతి)



రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా బాసర బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. యాంచ రైల్వే దాటిన తర్వాత బాసర బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని సుమారు 60 నుంచి 65 సంవత్సరాల వృద్ధుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## 8వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు భూమిపూజ

(నిజామాబాద్, ఇదీ సంగతి)



నగరంలోని 8వ డివిజన్‌లో సీసీ రోడ్లు, మురికికాలువల నిర్మాణ పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. టియుఎఫ్ఐడిసి నిధులు రూ.కోటితో చేపట్టనున్న పనులకు డివిజన్ కార్పొరేటర్, మున్సిపల్ ఫ్లోర్ సెక్రటరీ మఠం పవన్‌కుమార్ భూమిపూజ చేశారు.డివిజన్‌లోని పలు కాలనీల్లో నాలుగు దశాబ్దాలుగా రోడ్లు, డ్రైనేజీ సమస్యలు కొనసాగుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. వర్షాకాలంలో మురుగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. తాజాగా నిధులు మంజూరు కావడంతో సీసీ రోడ్లు, మురికికాలువల నిర్మాణానికి మార్గం సుగమమైందన్నారు.రూ.కోటితో చేపట్టే అభివృద్ధి పనులతో డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రహదారులు, మురికికాలువల సమస్యలు పరిష్కారమవుతాయని కార్పొరేటర్ మఠం పవన్‌కుమార్ తెలిపారు. పనులను నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు.కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకురాలు వరలక్ష్మి, గోపాల్, లింగాల క్రాంతి, మఠం గోపి, అంజయ్య, రంగు వేణు, రీతు సింగ్‌తో పాటు డివిజన్ బీజేపీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# ఆర్మూర్ నియోజకవర్గంలో పెండింగ్ పనులు పూర్తి చేయాలి

**– మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి వినతి**

(ఆర్మూర్, ఇదీసంగతి)

ఆర్మూర్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. గుత్ప బ్యాలెన్సింగ్ ట్యాంక్ ఆధారంగా చేపట్టిన లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలోని మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. గుత్ప, మామిడిపల్లి, రామచంద్రపల్లి, అంకాపూర్, మదన్‌పల్లి, చిన్నాపూర్, ఓడెట్‌పల్లి, అమ్రాద్, జక్రాన్‌పల్లి, అర్గుల్, లక్ష్మాపూర్, మునిపల్లి గ్రామాల్లో రూ.7 కోట్ల విలువైన పనులు పూర్తిచేసి 2,642 ఎకరాలకు సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే నియోజకవర్గంలోని నిజాంసాగర్ కాల్వల ఆధునికీకరణకు ఇప్పటికే మంజూరైన రూ.22 కోట్ల పనులను తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.రూ.80 కోట్ల అంచనా వ్యయంతో మంజూరైన బినోల్--కంఠం--చిక్లీ లిఫ్ట్ ఇరిగేషన్ పథక పనులను వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ పథకం పూర్తయితే మొత్తం 5,550 ఎకరాలకు కొత్తగా సాగునీరు అందనున్నట్లు తెలిపారు. ఇందులో బోధన్ నియోజకవర్గంలోని బినోల్ గ్రామంలో 2,000 ఎకరాలు, ఆర్మూర్ నియోజకవర్గంలోని కంఠం, చిక్లీ గ్రామాల్లో 3,550 ఎకరాలకు నీరు అందుతుందని పేర్కొన్నారు.నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ఇతర సాగునీటి పనులను కూడా ప్రాధాన్య క్రమంలో పూర్తి చేసి రైతులకు ప్రయోజనం కల్పించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి కోరారు.



# పాలిటెక్నిక్ విలీనానికి వ్యతిరేకంగా నిరసన

(నిజామాబాద్ ఇదీసంగతి)

పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి/వైఎస్‌యూ వ్యవస్థలో విలీనం చేయొద్దని డిమాండ్ చేస్తూ తెలంగాణ పాలిటెక్నిక్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ) ఆధ్వర్యంలో ఉద్యోగుల నిరసన మంగళవారం 23వ రోజూ కొనసాగింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నిజామాబాద్ స్థానిక విభాగం ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు.పాలిటెక్నిక్ విద్యావ్యవస్థ గత 70 ఏళ్లుగా పేద, నిరుపేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్యను అందిస్తూ విజయవంతంగా కొనసాగుతోందని టీపీజేఏసీ ప్రతినిధులు తెలిపారు. దాదాపు 95 శాతం ప్రవేశాలతో పేద విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఈ వ్యవస్థను మార్చడం వల్ల విద్యార్థులపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు.పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి/వైఎస్‌యూ వ్యవస్థలో విలీనం చేసే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై




ఏర్పాటు చేసిన కమిటీని త్వరగా సమావేశపరిచి సానుకూల నివేదిక ఇవ్వాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను యథాతథంగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి వ్యవస్థలో విలీనం చేయకూడదు. ఏర్పాటు చేసిన కమిటీని వెంటనే సమావేశపరిచి సానుకూల నివేదిక ఇవ్వాలి. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను కొనసాగించాలి.

# హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన

(నిజామాబాద్ ఇదీసంగతి)

అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర పిలుపు మేరకు, రాష్ట్ర అధ్యక్షుడు అంజి యాదవ్ ఆదేశాలతో మంగళవారం నిజామాబాద్‌లో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అల్లు అర్జున్ ఫ్యాన్స్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండల సురేష్ ఆధ్వర్యంలో జనసేన నిజామాబాద్ జిల్లా నాయకుడు గుండా సంతోష్ హెచ్‌పీవీ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు.అనంతరం ఎల్లమ్మగుట్టలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో నిర్వహించిన హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమానికి 20వ డివిజన్ కార్పొరేటర్, బీజేపీ సీనియర్ నాయకుడు న్యాలం రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాధాన్యత, ఆరోగ్య పరిరక్షణలో దాని ఉపయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం న్యూ ప్రియదర్శిని పాఠశాల




ప్రిన్సిపల్ పుష్పలత ప్రకాశ్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.అల్లు అర్జున్ ఫ్యాన్స్ జిల్లా, నగర కమిటీ సభ్యులు నవీన్, దీపక్, మహేష్, గోపి, బబ్లూ, కార్తీక్, సుమంత్, విఘ్నేష్, లక్ష్మణ్, శ్రీను, విజయ్‌తో పాటు అభిమానులు పాల్గొన్నారు.

# ప్రజాసేవ చేస్తూనే పీహెచ్‌డీ సాధించిన కారేగాం తండా సర్పంచ్

(నిజామాబాద్ ఇదీసంగతి)

గ్రామ సర్పంచ్‌గా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే ఉన్నత విద్యను కొనసాగించి పీహెచ్‌డీ సాధించి కారేగాం తండా సర్పంచ్ డాక్టర్ రమావత్ లాల్‌సింగ్ అరుదైన ఘనత సాధించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం హిందీ విభాగంలో 'సమకాలీన హిందీ ఉపన్యాస్ మే సాంప్రదాయిక్ సంఘర్ష్' అంశంపై పరిశోధన పూర్తి చేసిన ఆయనకు వర్సిటీ 85వ స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టా అందజేశారు. కాన్వొకేషన్‌లో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, భారతీయ బయోటెక్నాలజీ చైర్మన్ డా. కృష్ణ మిలా, వీసీ మొగలయ్య చేతుల మీదుగా రమావత్ లాల్‌సింగ్ డాక్టరేట్‌ను స్వీకరించారు.ఒకవైపు సర్పంచ్ బాధ్యతలు నిర్వహిస్తూ గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే.. మరోవైపు



పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ సాధించడం అభినందనీయమని గ్రామస్థులు, ప్రజా ప్రతినిధులు, విద్యావేత్తలు పేర్కొన్నారు. ఆయన సాధించిన విజయం యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.తన పరిశోధనకు సహకరించిన వర్సిటీ అధ్యాపకులు, కుటుంబ సభ్యులు, మిత్రులు, గ్రామ ప్రజలకు డాక్టర్ లాల్‌సింగ్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యా రంగంతో పాటు ప్రజాసేవలోనూ మరింతగా కృషి చేస్తానని చెప్పారు.

# ఆరోగ్య పరిరక్షణలో ఫిజియోథెరపీ కీలకం




(నిజామాబాద్ ఇదీసంగతి)

ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఫిజియోథెరపీ సేవలు ఎంతో కీలకమని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. వరల్డ్ ఫిజియోథెరపీ డే సందర్భంగా జిల్లా ఫిజియోథెరపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ప్రమాదాలు, గాయాలు, శస్త్రచికిత్సలు, కీళ్లు, కండరాల సమస్యలు, నడకలో ఇబ్బందుల నుంచి కోలుకోవడంలో ఫిజియోథెరపీ చికిత్స ఉపయోగకరంగా ఉంటుందని సీపీ తెలిపారు. ప్రస్తుత జీవన విధానంలో శారీరక శ్రమ తగ్గడం, ఎక్కువసేపు కూర్చుని పనిచేయడం, వ్యాయామానికి దూరంగా ఉండటం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నడక, వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు.రోగులకు చికిత్స అందించడంతోపాటు వారు తిరిగి సాధారణ జీవన విధానానికి చేరుకునేలా పునరావాసం కల్పించడంలో ఫిజియోథెరపిస్టుల పాత్ర అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన దాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మేయర్ ఉమారాణి, ఫిజియోథెరపీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శివకుమార్, ఉపాధ్యక్షురాలు డాక్టర్ అశ్విని జోషి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రమోద్‌కుమార్, కోశాధికారి డాక్టర్ కీర్తిగుప్తా తదితరులు పాల్గొన్నారు.

# యేండల సువర్చలకు ఓయూలో డాక్టరేట్




(నిజామాబాద్ ఇదీసంగతి)

తెలంగాణ విశ్వవిద్యాలయం ఎడ్యుకేషన్ విభాగంలో అకాడమిక్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న యేండల సువర్చల ప్రదీప్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఓయూ 85వ స్నాతకోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్ల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ చేతుల మీదుగా సువర్చల ప్రదీప్ డాక్టరేట్ అందుకున్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ వారం రోజుల ఆందోళనలు సక్సెస్

(నిజామాబాద్, ఇదీ సంగతి)



కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల మోసపూరిత పాలనను ఎండగడుతూ బీఆర్ఎస్ చేపట్టిన వారం రోజుల ఆందోళనలు విజయవంతమయ్యాయని ఆ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్మూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆందోళనల వివరాలను వెల్లడించారు. జిల్లాలో అన్ని వర్గాల ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని తెలిపారు. ఇందూరు గడ్డ బీఆర్ఎస్‌కు కంచుకోట అని, కేసీఆర్‌కు అడ్డా అని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ మలి దశ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన బీఆర్ఎస్‌కు తొలి అధికార పదవి ఇచ్చింది నిజామాబాద్ జిల్లానేనని గుర్తుచేశారు. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయడంలోనూ ఇందూరు జిల్లా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఎన్నికల సమయంలో హామీలు అమలు చేస్తామని ఒట్లు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు వాటి అమలుపై నిలదీస్తే ప్రజలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను పక్కన పెట్టిందని ఆరోపించారు. "చీటింగ్, లూటింగ్‌లో రేవంత్ సర్కారు ఆరితేరింది. ఖజానాకు కన్నం.. పాతగోడలకు సున్నం తప్ప వెయ్యి రోజుల పాలనలో సాధించింది ఏమిటి?" అని ప్రశ్నించారు. నందిపేటలో రైతు సదస్సు నిర్వహించి వ్యవసాయం, సాగునీరు, విద్యుత్, యూరియా కొరత తదితర అంశాలపై రైతులతో చర్చించామని తెలిపారు. రైతు బంధు, రైతుబీమా, పంటల కొనుగోళ్లు, బోనస్, రుణమాఫీ విషయంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో వ్యవసాయం స్వర్ణయుగంగా సాగిందని రైతులు పేర్కొన్నారని చెప్పారు. మహిళలు, దివ్యాంగులతో నిర్వహించిన సదస్సులకు మంచి స్పందన వచ్చిందన్నారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ. 2,500, బాలికలకు స్కూటీలు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద తులం బంగారం తదితర హామీలు అమలు కాలేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం అందించిన కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు, బతుకమ్మ చీరల పంపిణీని నిలిపివేశారని ఆరోపించారు. జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్, విద్యార్థుల సమస్యలపై ర్యాలీలు నిర్వహించామని జీవన్‌రెడ్డి తెలిపారు. జాబ్ క్యాలెండర్ 'జాబ్‌లెస్ క్యాలెండర్'గా మారిందని విమర్శించారు. తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీ అమలు కాలేదన్నారు. విద్యాభరోసా కార్డు, వడ్డీలేని రుణాల హామీలు కూడా నెరవేరలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీల అమలుపై ప్రజావాణి కేంద్రాల్లో అధికారులకు వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. బీఆర్ఎస్ ఆందోళనలకు సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పోలీసులు అధికార కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ బీఆర్ఎస్ శ్రేణులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో మాజీ జడ్పీ ఛైర్మన్ విఠల్‌రావు, సీనియర్ నాయకుడు రాజారాం యాదవ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# ఎయిమ్స్‌లో అత్యాధునిక వైద్య సేవలు

(నిజామాబాద్, ఇదీ సంగతి)



కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎయిమ్స్ లో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. భువనగిరి జిల్లా బీబీ నగర్లో గల ఎయిమ్స్ ( ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్) ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రైవేటు ఆసుపత్రులకు ధీటుగా వైద్య సేవలు అందుతున్నాయన్నారు. మొత్తం 750 బెడ్ లతో నిర్మిస్తున్న ఎయిమ్స్ లో ప్రస్తుతం 260 అందుబాటులో ఉన్నాయన్నారు. మరో ఆరు నెలల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రధానంగా కేవలం పది రూపాయల ఫీజుతో ఏడాదిపాటు ఓపీ పొందవచ్చన్నారు. అలాగే ఇన్ పేషెంట్ గా అడ్మిట్ అయితే ఒకరోజుకు బెడ్ ఛార్జీ కేవలం రూ. 35 తీసుకుంటారన్నారు. కావున పేద మధ్య తరగతి కుటుంబాల వారు వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం 25 ప్రధాన విభాగాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. దీర్ఘ కాలిక వ్యాధులు, అత్యవసర వైద్యం కావలసిన వారు ఎయిమ్స్ లో చికిత్స పొందాలన్నారు. అవసరమైన వారు తమను సంప్రదిస్తే రిఫర్ చేస్తామని తెలిపారు.

## వినాయక చవితి ఉత్సవాల్లో డీజేలకు అనుమతివ్వాలి



(నిజామాబాద్, ఇదీ సంగతి)

వినాయక చవితి ఉత్సవాల్లో నిబంధనలకు లోబడి డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల వినియోగానికి అనుమతులు ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి కోరారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక చవితి, శ్రీరామనవమి, హనుమాన్ జన్మోత్సవం, దేవీ నవరాత్రులు, ఛత్రపతి శివాజీ జయంతి వంటి ప్రధాన పర్వదినాల్లో మాత్రమే హిందువులు సౌండ్ సిస్టమ్‌లను వినియోగిస్తారని తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గణేష్ ఆగమనం, నిమజ్జన ఊరేగింపులకు అనుమతులు ఇవ్వాలని కోరారు. దీనిపై సీపీ సానుకూలంగా స్పందిస్తూ నిబంధనల మేరకు రెండు స్పీకర్లతో కూడిన సౌండ్ సిస్టమ్ వినియోగానికి అనుమతి ఇస్తామని తెలిపినట్లు దినేష్ పటేల్ కులాచారి వెల్లడించారు.

## నిబంధనలను ఉల్లంఘిస్తున్న బి.ఎడ్ కళాశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలి

(నిజామాబాద్, ఇదీ సంగతి)



ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐపీఎస్‌యూ, డీఎస్‌వో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చీజుజు (నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్) నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించబడుతున్న బి.ఎడ్ కళాశాలలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ యూనివర్సిటీ ఆడిట్ సెల్ డైరెక్టర్ డా. చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పలు బి.ఎడ్ కళాశాలలు చీజుజు నిబంధనలను బహిరంగంగా ఉల్లంఘిస్తూ అధిక మొత్తంలో ఫీజులు, అడ్మిషన్ సమయంలోనే అటెండెన్స్ ఫీజు పేరుతో అక్రమంగా వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అర్హత కలిగిన ఫ్యాకల్టీ, సొంత భవనం, ల్యాబ్‌లు, లైబ్రరీ, మౌలిక వసతులు లేకపోయినా అఫిలియేషన్ ఇవ్వడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందన్నారు. గత ఎనిమిదేళ్లుగా కొన్ని కళాశాలలు కోర్టు నుంచి తాత్కాలిక అనుమతులు పొందుతూ కొనసాగుతున్న ప్పటికీ యూనివర్సిటీ అధికారులు కౌంటర్ దాఖలు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. కోర్టు ఒక్కో ఏడాదికే అనుమతి ఇస్తున్నా ఇప్పటికీ సొంత భవనాలు నిర్మించుకోని కళాశాలలపై చర్యలు తీసుకోకపోవడం అధికారుల వైఫల్యమని విమర్శించారు. థామస్, చైతన్య, ప్రియదర్శిని, క వంటి బి.ఎడ్ కళాశాలల్లో కనీస అర్హత కలిగిన అధ్యాపకులు, మౌలిక వసతులు లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నప్పటికీ యూనివర్సిటీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని కళాశాలల్లో కనీసం బెంచీలు కూడా లేకపోవడం, స్కూల్ మరియు బి.ఎడ్ కళాశాలను ఒకే భవనంలో నిర్వహించడం, తరగతులు సక్రమంగా నిర్వహించకుండా కేవలం ఫీజులు వసూలు చేసి సర్టిఫికెట్లు ఇచ్చే పరిస్థితి విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందన్నారు. నిబంధనలు ఉల్లం ఘిస్తున్న కళాశాలలపై విచారణ జరిపి, ప్రమాణాలు పాటించని కళాశాలల అఫిలియేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ వ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విగ్నేష్, ఏఐఎస్‌యూ జిల్లా కార్యదర్శి అనిల్, ఇూూ తెలంగాణ యూనివర్సిటీ నాయకులు గోపీచంద్, ఏఐపీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్ సింగ్ ఠాగూర్, ఏఐఎస్ఎఫ్ తెలంగాణ యూనివర్సిటీ కన్వీనర్ చందు, నాయకులు వినీత్, సూర్యపాల్, ఆజాద్, సునీల్ పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నోటీసుల మోత!

(నిజామాబాద్ ప్రతినిధి, ఇదీ సంగతి)

***గడువు దగ్గరపడుతున్నా.. నోటీసుల పంపిణీ నెమ్మదే!***

జిల్లాలో మొత్తం 301 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా 1,09,639 నోటీసులు జారీ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 4,32,401 నోటీసులు జనరేట్ చేయగా.. 60,608 నోటీసులు పంపిణీ చేశారు. ఇంకా 49,031 నోటీసులు పంపిణీ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 17,939 మంది హియరింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. మరో 49,592 మంది హియరింగ్ గడువు ముగిసిన జాబితాలో ఉన్నారు. నోటీసుల ప్రింటింగ్, పంపిణీలో జాప్యం జరుగుతుండటంతో ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. నోటీసు అందుకున్నవారికి నిర్ణయించిన రోజున ఇతర పనులు ఉండటం, సమాచారం సకాలంలో చేరకపోవడం వంటి కారణాలతో పలువురు హియరింగ్‌కు హాజరు కావడం లేదు. దీంతో మళ్లీ తేదీలు కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ సమయంలో ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందిని కూడా వినియోగించిన అధికారులు.. ప్రస్తుతం నోటీసుల జారీ, హియరింగ్ ప్రక్రియను ప్రధానంగా బీఎల్‌వోలపైనే ఉంచారు. నోటీసు జారీ చేయడం నుంచి ఓటరు సమర్పించే ఆధారాలు, హియరింగ్‌కు హాజరైన ఓటరు ఫొటోలను యాప్‌లో అప్లోడ్ చేయడం వరకు మొత్తం ప్రక్రియను బీఎల్‌వోలే నిర్వహించాల్సి వస్తోంది. ఒకవైపు ఇంటింటికీ తిరిగి నోటీసులు అందజేయడం.. మరోవైపు హియరింగ్‌కు వచ్చిన వారి వివరాలు, ధ్రువపత్రాలను నమోదు చేయడం.. అనంతరం యాప్‌లో అప్లోడ్ చేయడంతో పని భారం పెరిగింది. నిబంధనల్లో తరచూ మార్పులు రావడం కూడా ఇబ్బందులకు కారణమవుతోంది.

***సెప్టెంబరు 16తో తెరపడనుందా?***

నోటీసులు అందుకున్న ఓటర్ల నుంచి అభ్యంతరాలు, ఆధారాల స్వీకరణకు సెప్టెంబరు 16 వరకు మాత్రమే గడువు ఉంది. ఈలోగా పెండింగ్‌లో ఉన్న 49,031 నోటీసుల పంపిణీ, హియరింగ్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే హియరింగ్ గడువు ముగిసిన వారి సంఖ్య 49,592కు చేరడంతో అధికారులు ప్రక్రియను వేగవంతం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

**ఎస్ఐఆర్ గణాంకాలు ఇలా..**

మొత్తం పోలింగ్ కేంద్రాలు: 301
జారీ చేయాల్సిన నోటీసులు: 1,09,639
జనరేట్ చేసిన నోటీసులు: 4,32,401
పంపిణీ చేసిన నోటీసులు: 60,608
పంపిణీ చేయాల్సినవి: 49,031
హియరింగ్ పూర్తయిన వారు: 17,939
హియరింగ్ గడువు ముగిసిన వారు: 49,592
అభ్యంతరాల స్వీకరణకు గడువు: సెప్టెంబర్ 16 వరకు.

## చికిత్స పొందుతున్న వ్యక్తికి పరామర్శ



(నిజామాబాద్, ఇదీ సంగతి)

ఇటీవల ప్రమాదవశాత్తు ప్రమాదం జరిగి చికిత్స పొందుతూ కోరుకుంటున్న ఎల్లేటి శివశంకర్‌ను పరామర్శించడం జరిగింది. శ్రీరామ్ మహిపాల్ చారి మాట్లాడుతూ. అందులో భాగంగా వేస్సో ట్రస్ట్ హైదరాబాద్ మరియు దాతల సహకారంతో 65 వేల రూపాయలు ఆర్థిక సహాయం ఇప్పించడం జరిగింది.. అంతేకాకుండా ఓం విశ్వకర్మ టీవీ ఛానల్ ఎండి కొండోజు నరసింహ చారి మాట్లాడుతూ వారి దీన స్థితిని చూసి చలించిపోయి శివశంకర్ భార్య అనూషకు బ్యాంగిల్స్ అండ్ జనరల్ స్టోర్ షాప్ పెట్టిస్తానని మాట ఇవ్వడం జరిగింది.. అలాగే కుట్టు మిషన్ కూడా ఇప్పియ్యడానికి కృషి చేస్తానని మహిపాల్ చారి మాట ఇవ్వడం జరిగింది.. చాలా బీదరికంలో ఉన్న శివశంకర్ కనీసం ఉండడానికి ఇల్లు కూడా లేదు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు కావున ఎవరైనా దాతలు సహకరించి వారి కుటుంబానికి అండగా నిలవాలని ఈ సందర్భంగా కోరడం జరిగింది. విశ్వకర్మ వేల్పూర్ మండల అధ్యక్షులు నూనె గంగాధర్. శ్రీరామ్‌సుదర్శన్ నారాయణ గంగాధర్ నర్సయ్య పాల్గొన్నారు.